క్లుప్తంగా

17న పెన్షనర్ల సంఘం వార్షికోత్సవం

కవిటి: ఇచ్ఛాపురం సబ్ ట్రెజరీ పరిధిలోని కవిటి మండల పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన కవిటిలో సంఘం 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు గొండ్యాల జానకిరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ-1, 2 సచివాలయాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన పలువురు ఉద్యోగస్తులను గురువారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన వీఆర్వో ఆర్.ప్రసాద్, జె.పార్వతి, డిజిటల్ అసిస్టెంట్ వీవీ నారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ గవరయ్య, విలేజ్ సర్వేయర్ త్రిమూర్తులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాపతి, వీఆర్వో మంగులు, డిజిటల్ అసిస్టెంట్ ఉదయ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అయ్యప్ప విగ్రహానికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణంలోని స్వేచ్ఛావతి నగర్‌లో ఉన్న పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయం 16వ వార్షికోత్సవాన్ని దుర్గా గురుస్వామి అధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అయ్యప్ప విగ్రహానికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో వందమంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన



టిడ్కో ఇళ్లు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజల కోసం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో నిర్మించిన ఏపీ టిడ్కో ఇళ్ల సముదాయాన్ని, ఎంఐజీ ఇళ్ల స్థలాల లే అవుట్‌ను మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పరిశీలించారు. గురువారం సాయంత్రం రెండు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రస్తుత పరిస్థితులు తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. కొనుగోలు చేసిన లబ్ధిదారులకు ఎంఐజీలో ఇళ్ల స్థలాలు చూపించాలని వస్తున్న డిమాండ్ రీత్యా అక్కడి పరిస్థితి పరిశీలించారు. అతనితో పాటు టిడ్కో ఇళ్లు బాధ్యులు జగన్నాథరావు, మున్సిపాలిటీ సిబ్బంది కృష్ణారావు తదితరులు ఉన్నారు.

గోకులం షెడ్ల పరిశీలన



మందసలో పశువులను పరిశీలిస్తున్న డాక్టర్ మురళీధర్ తదితరులు

కాశీబుగ్గ: శ్రీకాకుళం పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఆర్.మురళీధర్ పలాస, మందస మండలాన్ని గురువారం సందర్శించారు. దీనిలో భాగంగా అన్ని పశు వైద్యశాలల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 21వ పశు గణనను పక్కాగా నిర్వహించాలని సూచించారు. కొత్తగా నిర్మించిన గోకులం షెడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి.నారాయణరావు, సహాయ సంచాలకుడు డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కంచిలి: మండల పరిధిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలను ఎంపీడీవో వి.తిరుమలరావు ఎంఈవో-1 ఎస్.శివరాంప్రసాద్‌తో కలిసి గురువారం తనిఖీ చేశారు. నువాగడ కాలనీలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల, నువాగడ కాలనీ, నువాగడ, తుట్టాసాయి గ్రామాల్లో నిర్వహిస్తున్న జీపీఎస్ పాఠశాలలను పరిశీలించారు. నువాగడ కాలనీలో ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో సౌకర్యాలను, ఇతర విభాగాలను పరిశీలించారు. విద్యార్థులను సక్రమంగా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

- హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ ఊసెత్తని వైనం
- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు

అన్నదాత అగచాట్లు



టెక్కలి:

ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పిన మాటలు నీటిమీద రాతలు అవుతున్నాయి. అధికారం చేపట్టి 6 నెలలు పూర్తి చేసుకున్నా అన్నదాతకు ఇచ్చిన హామీల ఊసెత్తడం లేదు. దీంతో అన్నంపెట్టే రైతు అగచాట్లు పడుతున్నాడు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఉవ్వెత్తున ప్రచారం చేశారు. కానీ ఇప్పటివరకు అమలు చేసిన పాపాన పోలేదు. దీంతో ప్రభుత్వం నుంచి ప్రకటన కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన



రైతు భరోసా కేంద్రం(ఫైల్)

ఏడాదిలోనే రైతు భరోసా పథకం అందజేశారు. దీనిలో భాగంగా పెట్టుబడి సాయంగా రైతులకు రూ.13,500లు అందించారు. టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో మొత్తంగా 49,172 మంది రైతులకు సుమారు రూ.303 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే నియోజకవర్గంలోని 44,172 మంది రైతులకు రూ.59,63,22000 సాయం అందజేసి రైతు ప్రభుత్వంగా గుర్తింపు సాధించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలకు పేరు మార్చుకోవడంలో చూపిన శ్రద్ధ, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడంలో చూపలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ-క్రాఫ్ రిపోర్టు మేరకు ఈ ఏడాది అన్నదాత సుఖీభవ పథకం ఖరీఫ్ సీజన్‌లో 55,256 మందికి అమలు చేయాల్సింది.

అప్పుల పాలయ్యారు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. దీంతో పంట పెట్టుబడి సాయం అందక రైతులు అప్పులపాలయ్యారు. ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోయాయి. ప్రభుత్వం ఇప్పటివరకు పథకం గురించి ప్రస్తావన తీసుకు రాకపోవడం సరికాదు. ఇప్పటికైనా పథకం అమలుకు చర్యలు తీసుకోవాలి.

– పిన్నింటి అజిత్, పెంటూరు, నందిగాం మండలం

ఊసెత్తడం లేదు



అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే కూటమి నాయకులు ఎత్తడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంట పెట్టుబడి లేక ఖరీఫ్ ఆరంభంలోనే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి.

– కణితి రామచంద్రుడు, హరిదాసుపురం, నందిగాం మండలం

మోసం చేశారు



అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీలిచ్చారు. అయితే అధికారం దక్కించుకున్న తర్వాత రైతులను నిలువునా మోసం చేశారు. జిల్లాకు చెంది న వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు రైతులను ఆదుకునే విషయంలో వైఫల్యం చెందారు. పెట్టుబడి సాయం లేదు, విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోయారు. పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో వైఫల్యం చెందారు. కూటమి పాలనలో రైతులు నిలువునా మోసపోయారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, టెక్కలి నియోజకవర్గం

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

సోంపేట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సోంపేట ఎస్ఐ లవరాజు సూచించారు. పట్టణంలోని మహర్షి విద్యానికేతన్‌లో సంకల్పం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో విద్యార్థి దశ కీలకమని, ఈ దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలు జోలికి వెళ్లవద్దని, మాదక ద్రవ్యాలు సేవిస్తే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలు సేవించడం వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శకుంతల, కరస్పాండెంట్ కన్నా మాస్టర్, హెచ్ఎం తరణి ప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని శాశనం గ్రామంలో సంకల్పం కార్యక్రమం గురువారం నిర్వహించారు.



సోంపేట: మాట్లాడుతున్న ఎస్ఐ లవరాజు

ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో కలిసి ఆ గ్రామ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ప్రజలు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

'పాత స్థలాల్లోనే అమ్ముకోనివ్వండి'

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలు ఎత్తివేసి, పంచాయతీ వారు కేటాయించిన చిన్నపాటి స్థలంలో అమ్మకాలు చేపట్టాలని వ్యాపారులకు చెప్పడం సరికాదని సీఐటీయూ నాయకులు అన్నారు. పంచాయతీ కేటాయించిన 5 అడుగుల స్థలంలో ఏ షాపులు పెట్టుకొని అమ్మకాలు చేయాలో వారికి తెలియడం లేదన్నారు. వ్యాపారానికి సరిపడే మరోచోట స్థలం కేటాయించాలని, లేదా ప్రస్తుతం ఉన్న స్థలాల్లోనే సంక్రాంతి వరకు అనుమతులు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు నంబూరి షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య గురువారం స్థానిక పంచాయతీ అధికారులు, కూటమి నాయకులను కలిసి కోరారు. కార్యక్రమంలో తోపుడు బల్లు సంఘం నాయకులు ఉర్జాన మాధవరావు, ఎల్.వర్ధరాజులు, సీతమ్మ, కామేశ్వరి, రజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు బోరు

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడలో విలేజ్ హెల్త్ క్లీనిక్ వద్ద ఒక ప్రైవేటు వ్యక్తి వేసిన బోరు వివాదానికి దారి తీసింది. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలం, అందులో ఆస్పత్రి వద్ద సొంత అవసరాల కోసం బోరు వేయడాన్ని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. గ్రామస్తులు వద్దని చెప్పినా సదరు వ్యక్తి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శిని సంప్రదించకుండా బోరు వేయడంతో దానిని తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ



విలేజ్ హెల్త్ క్లీనిక్ వద్ద వేసిన బోరు

కార్యదర్శి కె.కామరాజును వివరణ కోరగా వారి అనుమతి తీసుకోలేదని, ప్రభుత్వ స్థలంలో బోరు వేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. తక్షణమే బోరు తొలగించాలని చెప్పామని, రెండు, మూడు రోజుల్లో బోరు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

నందిగాం: మండల పరిధి నందిగాం పరిశ్రమల ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగాం సబ్ స్టేషన్ పరిధిలోని గొల్లూరు, పెద్దతామరాపల్లి, శాసనాం, దిమిలాడ, బూరగాం తదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రైతు ర్యాలీకి తరలిరండి

కంచిలి: రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న రైతు ర్యాలీకి ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ పిలుపునిచ్చారు. ఉదయం 9.30 గంటలకు జరుగు కార్యక్రమంలో పాల్గొని, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు.

టెక్కలి: కూటమి ప్రభుత్వంలో రైతులకు జరిగిన అన్యాయంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ధర్నాకు నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

కవిటి: రైతులు, పేద ప్రజల పొట్టకొడుతున్న కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నిరసనలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళంలో జరగనున్న రైతుల ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పలాస మండలం అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు పిలుపునిచ్చారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



బాలికా విద్యను ప్రోత్సహించాలని కోరుతూ టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు గురువారం టెక్కలి మండలం చింతలగార గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో కళాశాల మహిళా సాధికారత సభ్యులు లీలాపద్మజ, ఝాన్సీ, కవి, తేజోవతి, సుహారిక పర్యవేక్షణలో విద్యార్థినులు ఇంటింటా ప్రచారం చేశారు. బాలికా విద్యను పోత్సహించి మహిళాభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. – టెక్కలి

వృథాగా తాగునీరు



వజ్రపుకొత్తూరు మండలంలోని కొండవూరు పంచాయతీలో శుద్ధజలం రోడ్డు పాలవుతోంది. జల్ జీవన్ మిషన్‌లో నిర్మించిన కుళాయిలకు వాటర్ ప్రెజర్ ఎక్కువ కావడంతో అవి పాడై మినరల్ వాటర్ వృథాగా పోతోంది. ఇక్కడ ఇంటింటికీ కుళాయి నిర్మాణం కాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా వృథా నీటిని కట్టడి చేయాల్సిన గ్రామీణ నీటి సరఫరా అధికారుల జాడ కరువైంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – వజ్రపుకొత్తూరు

విగ్రహం ఆవిష్కరణ



కంచిలి మండలంలోని చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో చదువుల తల్లి సరస్వతీ దేవి విగ్రహాన్ని పూర్వ విద్యార్థులైన ప్రస్తుత సైనిక ఉద్యోగుల సౌజన్యంతో నిర్మించారు. విగ్రహాన్ని ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు చేతులమీదుగా బుధవారం ఆవిష్కరించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోంపేట సీఐ బి.మంగరాజు చేతులమీదుగా, పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ సర్పంచ్ డొక్కరి బ్రహ్మానందం చేతులమీదుగా చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం మడ్డు తిరుపతిరావు, సైనిక ఉద్యోగులు బడ్డి కామరాజు, కర్రి దుర్యోధన, బడ్డి రామారావు, బడ్డి పవన్, జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు. – కంచిలి



అసంపూర్తిగా తవ్వకాల పూడ్చివేత



వాహనాలు వెళ్తుండడంతో ఎగురుతున్న ధూళి



మంచినీటి పైప్‌లైన్ వద్ద కేబుల్ తవ్వకాలు



మఠం కంచిలి మెయిన్ రోడ్డులో దుస్థితి

దుమ్ము దుమారం..!

కంచిలి మండల కేంద్రం కంచిలిలో మెయిన్‌రోడ్డు పక్కన బీఎస్ఎన్ఎల్ కేబుల్ తవ్వకాలు చేపట్టి, అసంపూర్తిగా పూడ్చారు. దీంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో విపరీతమైన ఇసుకతో కూడిన దుమ్ము, ధూళి గాల్లో లేస్తున్నాయి. ఫలితంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, దుకాణాల్లో పెద్ద ఎత్తున దుమ్ము చేరుతోంది. దీనివలన ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఈ కేబుల్ వేసేటప్పుడు మార్కెట్ కూడళ్లు, ఇళ్లు ఉన్న చోట్ల అండర్ గ్రౌండ్‌లో యంత్రం సాయంతో తవ్వకాలు చేపట్టాలి. కానీ కంచిలిలో మాత్రం పూర్తిగా జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. కేబుల్ వేసిన తర్వాత కూడా అసంపూర్తిగా పూడ్చడంతో ఇలాంటి దుస్థితి ఏర్పడింది. పక్కనే ఉన్న సోంపేటలో మాత్రం భూగర్భ తవ్వకాలు చేపట్టారు. దీనిపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – కంచిలి

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పలాస: నీటి సంఘాల ఎన్నికలు జరగనున్న కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా పరిధిలోని ఓటర్లు అక్కడకు వెళ్లి ఈనెల 14న జరుగనున్న ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో డీటీలు గిరిరాజు, లక్ష్మీనారాయణ, సునంద తదితరులు పాల్గొన్నారు.



పోలీసు జాగిలంతో వెదుకుతున్న దృశ్యం

విస్తృతంగా తనిఖీలు

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చే బస్సులు, రైళ్లలో కాశీబుగ్గ పోలీసులు జాగిలంతో గురువారం రాత్రి తనిఖీలు చేపట్టారు. పలాస రైల్వేస్టేషన్‌కు వచ్చిన రైళ్లు, కాశీబుగ్గ బస్టాండ్‌లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మూడు బస్సులను జల్లెడ పట్టారు. తనిఖీల్లో కాశీబుగ్గ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పాఠశాల భవనాలను నిర్మించండి'

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి కొండ వద్ద అధికారులు గుర్తించిన స్థలంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల భవనాలను నిర్మించాలని జనసేన పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు కోరారు. అక్కుపల్లి-బైపల్లిలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను గురువారం సందర్శించి తరగతి గదులు, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఆయనతో పాటు అర్జీ తులసీరావు, నాగేశ్వరరావు, సాయి కుమార్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న దుర్గారావు